క్లుప్తంగా

నీట్ పరీక్షపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

తగరపువలస : నీట్ యూజీసీ – 2024 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి దర్యాప్తునకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న కోరారు. ఈ మేరకు ఆమెకు హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఈ ఏడాది మే 5న నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల నుంచి తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపి పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే నీట్ పరీక్షలో అక్రమాలపై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు కోసం రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

పద్మనాభం : తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.వెంకటరావు రెవెన్యూ రికార్డులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడంగల్ల వంటి రికార్డులను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా కొండలు, భూముల నుంచి మట్టి, గోస్తని నదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కోటీశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జెండర్ కమిటీ సభ్యులు బాధ్యతతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ సత్యంనాయుడు

పద్మనాభం : గ్రామైఖ్య సంఘాల జెండర్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని వెలుగు ఏరియా కో – ఆర్డినేటర్ సత్యంనాయుడు సూచించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల జెండర్ కమిటీ సభ్యులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, లైంగిక నేరాలపై రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల్లో ఆయన మాట్లాడారు. జెండర్ కమిటీ సభ్యులు గ్రామ స్థాయిలో కుటుంబ హింస, బాల కార్మిక వ్యవస్థ, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, లైంగిక నేరాలు, చిన్న పిల్లల అక్రమ రవాణా రూపుమాపేందుకు కీలక పాత్ర పోషించాలన్నారు. ఏపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ కిశోరీ బాలికా సంఘాలు ఏర్పాటు చేసి పరిశుభ్రత, సమాజంలో జరిగే దురాగతాలపై తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయిలో సోషల్ యాక్షన్ కమిటీ, మండల స్థాయిలో మండల సోషల్ యాక్షన్ జెండర్ కమిటీ, జెండర్ ఫోరం పని చేస్తాయన్నారు. రిసోర్సుపర్సన్ రంగారావు మాట్లాడుతూ జెండర్ కమిటీలు స్త్రీ, పురుష సమానత్వం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఓబీలు, జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డులోని పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాల, మహాత్మా గాంధీ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు విద్యా కానుక కిట్లు గురువారం పంపిణీ చేశారు. కార్పొరేటర్ గంటా అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలోని కళాశాల బాలుర వసతి గృహం



బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ వద్ద బాలికల వసతి గృహం



హాస్టల్‌లోని విద్యార్థులు

10 హాస్టళ్లు... 754 సీట్లు

- ప్రభుత్వ హాస్టళ్లలో అడ్మిషన్లకు ఆహ్వానం
- అన్ని భవనాల్లో మెరుగైన వసతులు

మధురవాడ : సువిశాలమైన హాస్టల్ భవనాలు, రుచికరమైన, నాణ్యమైన భోజనం, విద్యార్థులను అత్యంత జాగ్రత్తతో చూసుకునే సిబ్బంది, వార్డెన్ల పర్యవేక్షణలో చక్కని విద్యా బోధనతో నడిచే ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలోని మధురవాడ, భీమిలి, తగరపువలస, ఆనందపురంలో 4 పాఠశాల సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో ఎస్సీ విద్యార్థులకు 342, ఎస్టీ – 23, బీసీ – 112, ఓసీ విద్యార్థులకు 27 కలిపి మొత్తంగా 504 సీట్లు ఉన్నాయి. వీటికి గత ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచడంతో భోజనంలో నాణ్యతతోపాటు ఉదయం సాయంత్రం వేళల్లో స్నాక్స్ కూడా అందిస్తున్నారు. ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, దుప్పట్లు, కాస్మోటిక్ చార్జీలు కూడా అందజేస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు అదనంగా ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు మధురవాడ, పరదేశిపాలెం, చినగదిలి, తగరపువలస, భీమిలి ప్రాంతాల్లో మరో 6 కళాశాల బాల, బాలికలకు వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 250 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 238, ఎస్టీ – 06, ఓసీ – 6 సీట్లు ఉన్నాయి. ఆయా వసతి గృహాల్లో అడ్మిషన్ల కోసం అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆయా హాస్టళ్లలో సంప్రదించాల్సి వుంది.



సమీకృత వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాఠశాలల వసతి గృహాలు ఇవే

వసతి గృహం పేరు	ప్రాంతం	సీట్లు	డబ్ల్యూహెచ్‌వో	ఫోన్
సమీకృత వసతి గృహం	మధురవాడ	262	రమేష్	91548 79173
			సరోజిని	98483 77248
			సురేంద్రనాథ్	94403 43757
ఎస్సీ బాలికల వసతి గృహం	చిట్టివలస	74	జి.రమాదేవి	94402 35594
బాలికల వసతి గృహం	ఆనందపురం	69	సంగీత	99896 86342
బాలుర వసతి గృహం	భీమిలి	69	ఆనంద కుమార్	95054 93341
కళాశాల వసతి గృహాలు ఇవే				
బాలుర వసతి గృహం	మధురవాడ	31	వీరబ్రహ్మం	95532 18772
బాలుర వసతి గృహం - 3	చినగదిలి	22	రమేష్	91548 79173
బాలుర వసతి గృహం	తగరపువలస	60	కె.సునీత	96428 07020
బాలుర వసతి గృహం	భీమిలి	38	సత్యనారాయణ	83416 43117
బాలికల వసతి గృహం	పరదేశిపాలెం	44	మోహిని	92900 43600
బాలికల వసతి గృహం	భీమిలి	85	అరుణ	98491 94381

అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న బాల, బాలికలకు ఉచితంగా వసతితోపాటు భోజనం కూడా అందిస్తున్నాం. పాఠశాల స్థాయి బాల, బాలికలకు 3వ తరగతి నుంచి భోజనం, దుస్తులు, కాస్మోటిక్ ఛార్జీలతోపాటు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. పాఠశాల స్థాయిలో బీసీ విద్యార్థులకు కూడా సీట్లు ఖాళీగా ఉన్నాయి. వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కళాశాల వసతి గృహాల్లో మాత్రం బీసీ సీట్లు నిండిపోయాయి. ఎక్కడైనా అడ్మిషన్ల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తితే నేరుగా మమ్మల్ని 94902 235594లో సంప్రదించవచ్చు

– జి.రమాదేవి, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, భీమిలి

కుండపోత వర్షంతో జలమయం



చిట్టివలసలో జోరున కురుస్తున్న వర్షం



సాగర్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

తగరపువలస : భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికి డ్రైనేజీలు, రహదారులు వర్షం నీటితో పొంగిపొర్లాయి. పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటీవల ఉక్కపోతతో అల్లాడిన జనం ఈ వర్షానికి సేదతీరారు. సాయంత్రం పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో ఇళ్లకు చేరాల్సిన విద్యార్థులు వర్షం కారణంగా కాస్త ఇబ్బంది పడ్డారు. మెట్ట పంటలు, కూరగాయల పంటలకు వర్షంతో ఊరట కలిగింది.

కొమ్మాది : గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి భగభగలతో వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది. కొమ్మాది, మారికవలస, భీమిలి బీచ్ రోడ్డు, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో సుమారు గంటపాటు కురిసిన వర్షానికి నగరవాసులు కాస్త ఉపశమనం పొందారు.

అర్హులందరికీ ఆరు నెలల్లో ఇళ్లు

మధురవాడ : అర్హులందరికీ ఆరు నెలల్లో పూర్తి స్థాయి సదుపాయాలతో టిడ్కో, హుద్‌హుద్ ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. గురువారం మధ్యాహ్నం బక్కన్నపాలెంలోని టిడ్కో హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఇళ్ల పరిస్థితి, కల్పించాల్సిన సౌకర్యాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని బక్కన్నపాలెం, కొమ్మాది, సుద్దగెడ్డ, దబ్బంద, సంగివలసలో 3,360 ఇళ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మధురవాడకు చెందిన ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు రాయిన శ్రీనివాసస్, వెంకటేష్, సూరిబాబు తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్సీ శైలజావల్లి, పీడీ డి.లక్ష్మి, ఈఈ శాంతిరాజు, కోరాడ రాజబాబు, వాండ్రాసి అప్పలనాయుడు, దాసరి శ్రీనివాస్, రామానాయుడు, పుసులేటి వాసు పాల్గొన్నారు.



బక్కన్నపాలెంలో టిడ్కో ఇళ్ల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

‘ఓక్రిడ్జ్’ విద్యార్థుల ప్రతిభ

తగరపువలస : విశాఖపట్నంలోని ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కేంబ్రిడ్జ్ ప్రైమరీ, లోయర్ సెకండరీ చెక్ పాయింట్ – 2024 పరీక్షల్లో అద్భుత ప్రతిభ చూపారు.

ఈ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లిష్, సైన్స్, లెక్కలు పరీక్షలు రాశారు. ప్రతీ విభాగంలో ఓక్రిడ్జ్ విద్యార్థులు అంతర్జాతీయ సగటు కంటే మెరుగ్గా ప్రదర్శన చేశారు. వీరేంద్ర రాఘవ్ లోయర్ సెకండరీ చెక్ పాయింట్‌లో ప్రథమ స్థానం, సైన్స్‌లో సంపూర్ణ మార్కులు సాధించారు. సాగి హరి పూజిత లోయర్ సెకండరీ చెక్ పాయింట్‌లో ద్వితీయ స్థానం, సైన్సులో సంపూర్ణ మార్కులు, సిద్ధార్థ్ రాజు ముదునూరు సైన్స్, లెక్కల్లో సంపూర్ణ మార్కులు, సాన్వి జైన్ ఇంగ్లిష్‌లో సంపూర్ణ మార్కులు, సార్విక్ సర్వసస్ ప్రైమరీ చెక్ పాయింట్‌లో ప్రథమ స్థానం, ఇంగ్లిష్, లెక్కల్లో సంపూర్ణ మార్కులు, సాయి ఆశీష్ ప్రైమరీ చెక్ పాయింట్‌లో ద్వితీయ స్థానం సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ షైలా బామిడిపాటి అభినందించారు.

భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇవ్వాలని వినతి

మధురవాడ : విశాఖ రూరల్ మండలం కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే ఇళ్లు ఇప్పించాలని సీపీఎం నాయకులు కోరారు. విశాఖలో జేసీ మయూర్ అశోక్‌కు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆధ్వర్యంలో రైతులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1976లో 86 కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున డి.పట్టాలు ఇచ్చినట్టు చెప్పారు. వారి సాగులో ఉన్న భూములు రైతులకు తెలియకుండా, ఎటువంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం బలవంతంగా తీసుకుని కార్యాలయాలు, నవోదయ వంటివి నిర్మించారని తెలిపారు. దీంతో సదరు రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి కనీసం నివాస స్థలాలైనా ఇవ్వాలని కోరారు. 2016లో ఈ భూముల్లో హుద్ హుద్ కాలనీ, జూనియర్ కళాశాల నిర్మించినప్పుడు బాధిత రైతులకు ఇళ్లు ఇస్తామని ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతులకు ఇళ్లు ఇవ్వకపోతే సదరు నివాసాల్లోకి ఎవ్వరినీ వెళ్లనీయబోమని స్పష్టం చేశారు. బాధిత పేద ఎస్సీ, బీసీ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని జేసీని కోరారు. కార్యక్రమంలో మధురవాడ జోన్ సీపీఎం కార్యదర్శి డి.అప్పలరాజు, కుల వివక్ష వ్యతిరేఖ సంఘం నాయకులు సియాద్రి పైడితల్లి, రైతులు దేవుడు, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



జేసీ మయూర్ అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

- కె.నగరపాలెం, కాపులుప్పాడ సచివాలయాల సమీపంలో ఇష్టారాజ్యంగా కొండల తవ్వకం
- పూర్తిస్థాయిలో సహకరిస్తున్న వీఆర్‌వో..?



ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో కరిగిపోయిన కొండ



ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వేయడంతో పడిపోయేందుకు సిద్ధంగా కొండ మీద చెట్టు

కొమ్మాది : గ్రావెల్ మాఫియా రెచ్చిపోయి పచ్చని కొండలను విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. రాయిని, గ్రావెల్‌ను వేరు చేసి అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు కొన్ని చోట్ల మనుషులతో, మరికొన్ని చోట్ల పొక్లెయినర్లతో ఇష్టారాజ్యంగా కొండలను తవ్వేస్తున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో జరుగుతోందనుకుంటే పప్పులో కాలేసినట్టే... జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, కాపులుప్పాడ, సచివాలయాల సమీపంలోనే ఈ తతంగం అంతా జరుగుతోంది. ఇంత జరుగుతున్నా తమకేమీ కనిపించదు అన్నట్లు రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. లారీలు, మినీ ట్రక్కుల ద్వారా రాయి, గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ పరిధిలోని కొండలపై గ్రావెల్‌ను పట్టపగలే అనధికారికంగా తరలిస్తున్నా ఉన్నతాధికారులకు తెలియకుండా ఓ వీఆర్‌వో వ్యవహారం నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా స్థానికులు గ్రావెల్ మాఫియాపై ఆర్‌డీవోకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా... వెంటనే సదరు వీఆర్‌వో ఆ గ్రావెల్ మాఫియాకు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేసేస్తున్నాడు. దీంతో ఉన్నతాధికారులు కొండల వద్దకు వచ్చినా ప్రయోజనం వుండడం లేదు. నిత్యం ఇక్కడ కొండను తవ్వేయడంతో ఆ కొండపై ఉన్న చెట్లు ఇప్పటికే కొన్ని నేలమట్టమైపోయాయి. మరికొన్ని పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. గ్రావెల్ మాఫియాపై కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుని పచ్చని కొండలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



తరలించడానికి సిద్ధం చేసిన రాయి

డ్రైనేజీలు లేక ఇక్కట్లు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల సరిహద్దుల్లోని శ్రీబాసర లే అవుట్‌కు ఆనుకుని జీడిపప్పుల దుకాణాల వెనుక డ్రైనేజీలు లేక మురుగునీరు నడిచే మార్గంలో చెరువులా మారిపోయింది. బాలాజీనగర్ – యాతపేట గ్రామాల్లో నివసిస్తున్న వారు ఇళ్లలో వినియోగిస్తున్న నీరు వెళ్లేందుకు మార్గం లేక పక్కనే ఖాళీ ప్రదేశంలోకి వదిలేస్తున్నారు. దీంతో ఈ మార్గం ద్వారా నడిచి వెళ్లేవారు, వాహనాలపై రాకపోకలు సాగించేవారు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీలు నిర్మించి బాలాజీనగర్ గెడ్డకు అనుసంధానించాల్సి వుందని గతంలో స్థానికులు జీవీఎంసీకి ఫిర్యాదు కూడా చేశారు. ఏడాది క్రితం శ్రీబాసర లే అవుట్‌లో తాత్కాలిక డ్రైనేజీని జీవీఎంసీ నిర్మించతలపెట్టినా సాకారం కాలేదు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు సాఫీగా వెళ్లే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీబాసర లే అవుట్ వైపు జీడిపప్పుల షాపుల వెనుక డ్రైనేజీలు లేక నిలిచిన మురుగు నీరు

డ్రగ్స్ సరఫరా నియంత్రణకు చర్యలు

సింహాచలం : గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయాలు నియంత్రించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నగర లా అండ్ ఆర్డర్ డీసీపీ – 2 సత్తిబాబు సూచించారు. ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నాయని అనుమానం వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారమివ్వాలని కోరారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణపై వెస్ట్ జోన్ పరిధిలోని గోపాలపట్నం, పెందుర్తి, ఎయిర్‌పోర్టు జోన్, కంచరపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో గురువారం సాయంత్రం సింహాచలంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కి బానిసలైన యువత ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతులు కూడా మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కన్నీటిని మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అందుకు అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు కూడా తమ వంతు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

అందరికీ అవగాహన కల్పించాలి

ముఖ్యంగా సచివాలయం పరిధిలో ఉన్న నివాసితులతో మహిళా పోలీసులు పరిచయం పెంచుకోవాలని డీసీపీ సత్తిబాబు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. స్కూళ్లు, కళాశాలల్లో కూడా విద్యార్థులకు తెలియపరచాలన్నారు. చిన్నచిన్న పాన్‌షాపులలో కూడా డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నారని, వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమీప పోలీస్ స్టేషన్ సీఐ లేదా ఎస్ఐకి సమాచారం అందించాలన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో ఉన్న సీఐలు, ఎస్‌లు కూడా మహిళా పోలీసులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహామూర్తి మాట్లాడుతూ ఉన్నత పౌరులుగా ఎదగాల్సిన యువత మాదక ద్రవ్యాలు, గంజాయి బారిన పడుతున్న పరిస్థితులను అరికట్టేందుకు సచివాలయాల మహిళా పోలీసులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సురేష్, రామకృష్ణ, చక్రధర్, గోపాలపట్నం ఎస్ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ నగరంపాలెం 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు గణేష్‌నగర్, పోర్టు కాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు లే అవుట్, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, ఆయోధ్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, మానం ఆంజనేయులు నగర్, మల్లయ్యపాలెం, సాక్షి పేపర్ ఆఫీస్ కార్యాలయం ఏరియా, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ శివారులో పలుచోట్ల సీసీ రోడ్ల మధ్యలో అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాలకు ఆటోలు, అత్యవసర వాహనాలేవీ చేరుకోలేకపోతున్నాయి. గతంలో విద్యుత్ స్తంభాలు వేసినప్పుడు, సీసీ రోడ్లు నిర్మించినప్పుడు స్థానికుల అభ్యంతరాలను అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్టు వేసి పడేశారు. దీంతో ప్రమాదకరమైన విద్యుత్ వైర్లు ఇళ్ల పైనుంచి, ఇళ్లను తాకుతూ వెళ్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. రోడ్లపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఏళ్ల తరబడి జీవీఎంసీ, విద్యుత్ సబ్‌స్టేషన్ల చుట్టూ బాలాజీనగర్ వాసులు తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. ఈ స్తంభాల్లో కొన్ని ఇనుపవి కూడా ఉండటంతో తుప్పు పట్టి ఆందోళన కలిగిస్తున్నాయి. రహదారికి అడ్డంగా ఉన్నవి, కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



బాలాజీనగర్‌లో సీసీ రోడ్డుపై అడ్డంగా విద్యుత్ స్తంభం

ఒకే ప్లాట్‌ఫారం మీదకు శ్రీరామ్ సేవలు

తగరపువలస : శ్రీరామ్ ఆటో మొబైల్స్‌కు అనుబంధంగా ఉన్న సేవలన్నింటినీ ఒకే ప్లాట్‌ఫారం మీదకు తీసుకొచ్చి తమ ఖాతాదారులకు అందించనున్నట్టు ఆ సంస్థ సీఈవో కమ్ డైరెక్టర్ సమీర్ మల్హోత్రా అన్నారు. భీమిలి దొరతోట నుంచి ఆనందపురం మండలం తర్లువాడకు తమ కార్యకలాపాలను బుధవారం నుంచి మార్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం సీజ్ చేసిన వాహనాలే కాకుండా వాహనాల పార్కింగ్, బీమా, డాక్యుమెంటేషన్, ఫాస్టాగ్, లాజిస్టిక్స్, ఫైనాన్స్, వాల్యుయేషన్ తదితర సేవలన్నీ అందిస్తున్నామన్నారు. వాహనదారులకు మధ్యవర్తులు, బ్రోకరేజీ వంటి భారం తగ్గిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా నెలకు 20 వేల వాహనాలు విక్రయిస్తున్నట్టు తెలిపారు. విశాఖ, హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, ఒంగోలు వంటి పట్టణాలకే పరిమితమైన తమ సేవలు గ్రామీణ నేపథ్యం కలిగిన శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బిజినెస్ హెడ్ రాజశేఖర్, రాష్ట్ర బిజినెస్ హెడ్ రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్ ఆటో మొబైల్స్ సీఈవో సమీర్ మల్హోత్రా